www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



ఆర్థిక సాయం అందజేసిన పూర్వ విద్యార్థులు



రూ.లక్షా 50వేలు అందిస్తున్న పూర్వవిద్యార్థులు

ప్రజాశక్తి- మామిడికుదురు

స్థానిక హైస్కూల్లో 1989 -90 పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆరోగ్యపరంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సహచర పూర్వ విద్యార్థుల నాలుగు కుటుంబాలకు గురువారం రూ.లక్షా 50వేల సాయం అందించారు. పాశర్లపూడి లంకకు చెందిన ఒక కుటుంబం, నగరానికి చెందిన మూడు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి మానవత్వంతో పాటు స్నేహం విలువ చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఈలి మురళీకృష్ణ, ఎన్‌విఎస్‌వి ప్రసాద్, వేగి లక్ష్మీనారాయణ, పాలూరి రాంబాబు, తోట దలీల, అల్లూరి సత్య కిషోర్ వర్మ,మెండ ఆదినారాయణ, చెవ్వకుల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రశాంతం

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 440 పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకూ పోలింగ్ జరిగింది. కొన్ని చోట్ల రాత్రి ఏడు గంటల వరకూ ఓటింగ్ జరిగింది. మొత్తంగా 69.50 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి తెలిపారు.

:: ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, విలేకర్లు ::

- 69.50 శాతం ఓటింగ్ నమోదు
- పిఠాపురంలో డబ్బులు పంచుతూ మీడియాకి చిక్కిన టిడిపి నాయకులు

మందకొడిగా పోలింగ్...

ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మందకొడిగా సాగింది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలలో 3,14,984 మంది ఓటర్లుండగా 69.50 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ 10 గంటల వరకూ 5.77 శాతం మాత్రమే నమోదైంది. మధ్యాహ్నం 12 గంటలకు 26 శాతం, 2 గంటలకు 49.52 శాతం నమోదైంది. 4 గంటలకు 63.28, ముగిసే సమయానికి 69.50 శాతం పోలింగ్ జరిగింది.

గతం కంటే ఈ సారే ఎక్కువ...

గతంలో జరిగిన ఎన్నికల కంటే ఈ సారే పోలింగ్ ఎక్కువగా నమోదైంది. 2019లో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి పోలింగ్ ఆ ఏడాది మార్చి 22 న జరిగింది. పోలింగ్‌లో 1,92,137 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 65.22 శాతం అంటే 1,12,454 మంది ఓట్లు వేయగా పశ్చిమ గోదావరి జిల్లాలో 65.65 శాతం అంటే 79,683 మంది ఓటు వేశారు. మొత్తంగా 65.40 శాతం ఓటింగ్ నమోదైంది. గతంతో పోల్చుకుంటే ఈసారి పోలింగ్ 4.1 శాతం ఓటింగ్ పెరిగి,ంది. 2013లో 52 శాతం ఓట్లు పోలయ్యాయి.



పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్కులను స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది

స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్స్‌లు

ఉభయ గోదావరి జిల్లాల్లోని పోలింగ్ కేంద్రాల నుండి బ్యాలెట్ బాక్సులను ఆర్‌టిసి బస్సుల్లో ఏలూరు సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు గట్టి భద్రత మధ్య తరలించారు. కొన్ని కేంద్రాల్లో పోలింగ్ ఆలస్యంగా నమోదవ్వడంతో రాత్రి 7 గంటల తర్వాత బ్యాలెట్ బాక్స్‌లను తరలించాల్సి వచ్చింది. కాకినాడ జిల్లాలో బ్యాలెట్ బాక్స్‌లను కలెక్టరేట్‌లోని వివేకానంద హాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తున్నామని ఎఆర్‌ఒ జె.వెంకట్రావు తెలిపారు. ఎంఎల్‌సి పోలింగ్ ప్రక్రియను కాకినాడ కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూము నుంచి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల ఎఆర్‌ఒ, కాకినాడ జిల్లా డిఆరఒ జె.వెంకరటరావు, ఇతర ఎన్నికల సిబ్బంది పర్యవేక్షించారు. కాకినాడ జిల్లాలోని 98 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు 59.01 శాతం ఓటింగ్ నమోదయినట్లు ఆయన తెలిపారు.



కపిలేశ్వరపురంలో ఓటు వేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులు

మొత్తం ఓటర్లు	: 3,14,984
ఓటు హక్కు వినియోగించుకున్నవారు	: 2,18,902
మొత్తం పోలింగ్ కేంద్రాలు	: 456
నమోదైన పోలింగ్ శాతం	: 69.50
తూర్పు గోదావరి జిల్లా	: 67.41
డా.బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా	: 73.09
కాకినాడ జిల్లా	: 66.84
ఏలూరు జిల్లా	: 70.13
పశ్చిమ గోదావరి జిల్లా	: 69.60
ఎఎస్ఆర్ జిల్లా	: 77.90



పెద్దాపురం మహారాణి కళాశాలలో బారులు తీరిన ఓటర్లు

ఓటేసిన పలువురు ప్రముఖులు

పలువురు ప్రముఖులు పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఐ.పోలవరం జడ్‌పి పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఓటు వేశారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు కోనసీమ జిల్లా అమలాపురంలోని ఎస్‌కెబిఆర్ కళాశాలలో ఓటు వేశారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం ఎస్‌కెపి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలువురు ఎంఎల్‌ఎలు, పలు పార్టీల నాయకులు ఆయా ప్రాంతాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.



పేరాబత్తుల రాజశేఖర్



ఎంఎల్‌సి ఐవి

కూటమి కుటిల ప్రయత్నాలు



పిఠాపురంలో డబ్బులు పంచుతున్న టిడిపి నాయకుడు

కూటమి అభ్యర్థి గెలుపు కోసం కూటమని నాయకులు కుటిల ప్రయత్నాలు చేశారు. ఓటర్లకు డబ్బుతో గేలం వేశారు. పిఠాపురంలో స్వయంగా టిడిపి మండల అధ్యక్షుడే రంగంలోకి దిగి ఆయనే స్వయంగా ఓటర్లకు నోట్లు లెక్కపెట్టి మరీ ఇచ్చారు. ఈ తతంగం అంతా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఉప్పందుకున్న ఆయన నాయకులతో కలిసి ఏమీ పట్టనట్టు బయటకు వచ్చారు. దీంతో డబ్బులు అందని ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఓట్లు వేయించుకుని డబ్బులు ఎగ్గొట్టారంటూ గగ్గోలు పెట్టారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, మండపేట, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలాల్లోనూ కూటమి నాయకులు ప్రలోభాలకు గురిచేశారు. ఓటుకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకూ పంపిణీ చేశారు.

చంటిబిడ్డలతో కలిసి...



జిల్లాలో పలువురు మహిళా ఓటర్లు చంటి బిడ్డలతో ఓటు వేసేందుకు వచ్చారు. ఉప్పలగుప్తం జడ్‌పి పాఠశాలలో పోలింగ్ కేంద్రానికి 3 నెలల చిన్నారితో బాలింత ఓటు వేసేందుకు వచ్చింది. అలాగే తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులో రెండు నెలల చిన్నారితో వచ్చి ఓటు వేసింది. ఉండ్రాజవరంలో మూడు నెలల చిన్నారితో కలిసి జంట ఓటు వేసింది.







సామర్లకోటలో ఓటేసేందుకు వస్తున్న వికలాంగురాలు



కొత్తపేటలో ఓటేసిన అక్కాచెల్లెల్లు

ముగిసిన ఎంఎల్‌సి పోలింగ్



రామచంద్రపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టుభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. **అమలాపురం :** ఎస్‌కెబిఆర్ కళాశాల నందు ఏర్పాటు చేసిన(215, 216, 217) మూడు పోలింగ్ కేంద్రాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల నందు ఏర్పాటుచేసిన (222 ,215) రెండు పోలింగ్ కేంద్రాలను జిల్లా రెవెన్యూ అధికారి, ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి బిఎల్ఎన్.రాజకుమారి సందర్శించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాస్ రామచంద్రపురం పట్టణంలోని 168 బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల సరళిని రామచంద్రపురం ఆర్‌డిఒ దేవరకొండ అఖిల పరిశీలించారు. కె.గంగవరం మండలంలోని ఎన్నికల కేంద్రం అదేవిధంగా రామచంద్రపురం జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఎన్నికల నిర్వహణను ఆమె పరిశీలించారు. **ఉప్పలగుప్తం:** మండల పరిషత్ కార్యాలయంలో నెం.243, 244, ఉప్పలగుప్తం పంచాయతీ కార్యాలయంలో నెం.245 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎంపిడిఒ కార్యాలయంలోని నెం243 పోలింగ్ కేంద్రంలో ఎంఎల్ఎ అయితా బత్తుల ఆనందరావు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ వివిఎస్.దివాకర్ తదితరులు పర్యవేక్షిం చారు. అమలాపురం డిఎస్‌పి టిఎస్ఆర్‌కె. ప్రసాద్, సిఐ పి.వీరబాబు, ఎస్ఐ సిహెచ్.రాజేష్ లు పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ పూర్తయ్యే సమయానికి మూడు పోలింగ్ బూత్‌లలో మొత్తం 1953 ఓటర్లకు 1479 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 75.3 శాతం పోలింగ్ నమోదయింది. **మండపేట:** స్థానిక ఏడిద రోడ్డు లో ఉన్న వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 155వ నెంబరు ఎన్నికల పోలింగ్ కేంద్రం లో ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయన ఓటు వేశారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు దూలి జయరాజు లు ఓటు వేశారు. పట్టణం, మండపేట మండలంతో కలిపి మొత్తం 79.28 శాతం ఓటింగ్ నమోదయ్యింది. **కాట్రేనికోన:** మండల పరిధిలోని కాట్రేనికోన జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలలో 1884 ఓట్లకు 1375 ఓట్లు పోలైనట్లు తహశీల్దార్ సునీల్ కుమార్ తెలిపారు. 73 శాతం పోలింగ్ నమోదయింది. **అంబాజీపేట:** మండల పరిధిలో 2446 ఓట్లకు గాను, పోలింగ్ ముగిసే సమయానికి 1822 ఓట్లు పోలైయ్యాయని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు.624 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేదన్నారు. సిఐ ఆర్.భీమరాజు పర్యవేక్షణలో ట్రైనీ డిఎస్‌పి పి.ప్రదీప్తి, ఎస్ఐ కె.చిరంజీవి పోలింగ్ ప్రశాంతంగా జరిపించేందుకు చర్యలు చేపట్టారు. **ఆత్రేయపురం:** పట్టభదుల ఎంఎల్‌సి ఎన్నికల్లో మొత్తం 16,01 ఓట్లకు గాను 12,44 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.77.70 శాతం పోలింగ్ నమోదయింది. స్థానిక మండల ప్రజా పరిషత్ లో 180 పోలింగ్ కేంద్రం రావి చెట్టు సెంటర్లో మండల పరిషత్ పాఠశాలలో 181, 182 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశారు. రావులపాలెం టౌన్ సిఐ శేఖర్ బాబు బందో బస్తు నిర్వహిం చారు. ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పి.రాజేశ్వరరావు పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. **ఆలమూరు:** మండల కేంద్రమైన ఆలమూరులో పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ 77.55 శాతం మేర జరిగింది. మండల ప్రజా పరిషత్ కార్యాలయం, స్త్రీశక్తి భవనం, మండల విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈమూడు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు (పిఒ) వి.శివరామ్‌కుమార్, జిఎస్ఆర్ శాస్త్రి, కె.వి.వి.సత్య నారాయణల ఆధ్వర్యంలో అధికారులు విధులు నిర్వర్తించారు. మండల వ్యాప్తంగా 1960 మంది ఓటర్లు ఉండగా 1520 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్ మండలంలోనున్న మూడు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు, ఎస్ఐ ఎం,అశోక్, ఎంపిడిఒ ఎ.రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. **ముమ్మిడివరం:** స్థానిక జడ్‌పిబాలుర, బాలిక ల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లకు ఉదయం 8 గంటలు నుండి ఓటర్లు బారులు తీరారు. మండల పరిధిలోని జడ్‌పి బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలోని ఐదు కేంద్రాలో శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల్లో పోలింగ్ ముగిసే సమయానికి 72.08 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రానికి సమీపంలో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు కు మద్దతుగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి. దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేసి ఓటు వేయడానికి వచ్చే ఓటర్లకు ఓటు వేసే విధానం పై యుటిఎఫ్ నాయకులు వివరించి సమస్యల పై పోరాడే వారికే ఓటు వేయాలని వివరించారు. శిబిరంలో యుటిఎఫ్ నాయకులు ఎస్.అబ్బులు, ఆర్.వీరాస్వామి, ఆర్‌బివి.రమణ, ఆర్.నాగార్జున, కె.దుర్గా ప్రసాద్ లతో పాటు పార్టీ సీనియర్ నాయకులు దొమ్మేటి వీర రాఘవులు మాదే శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పాము బాలయ్య లతో పాటు పలువురు పాల్గొన్నారు. **అయినవిల్లి :** ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన మూడు బూత్ లలో 2,514 మంది ఓటర్లు ఉన్నారు. 17,92 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు 71 శాతం పోలింగ్ నమోదైంది. **కపిలేశ్వరపురం:** మండలంలోని నిర్వహించిన పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. మండలంలో మొత్తం 1629 మంది ఓటి హక్కు వినియోగించుకోవలసి ఉండగా 1256 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 77.10 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల నిర్వహణఅధికారి, తహశీల్దార్ పి.చిన్నారావు తెలిపారు. **కొత్తపేట:** పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 202 లో తన ఓటు హక్కును వినియోగించు కున్నారు. **పి.గన్నవరం:** మండలంలో పట్టభద్రుల ఎంఎల్‌సి పోలింగ్ కు సంబంధించ 69.40 శాతం పోలినట్లు తహశీల్దార్ పి.శ్రీ పల్లవి తెలిపారు. మండలంలో 2582 ఓట్లకు గాను 1792 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. ఎంఎల్ఎ పి.గన్నవరం లో తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఎస్ఐ శివకృష్ణ ఆధ్వర్యంలో పోలింగ్ ప్రశాంతంగా జరిపించేందుకు చర్యలు చేపట్టారు. **మామిడికుదురు:** పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఒకటి, తహశీల్దార్ కార్యాలయంలో ఒకటి, జడ్‌పి ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 2,894 మందికి 2,062 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. 71.25 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల నిర్వహణఅధికారి, తహశీల్దార్ వైవి. సుబ్రహ్మణ్యాచార్యులు తెలిపారు డిసిసి అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు మండల పరిషత్ కార్యాలయం లో ఓటు హక్కు వినియోగించుకున్నారు ఈదరాడకు చెందిన ఎరుబండి ప్రభాకర్ రావు (మరుగుజ్జు) కాలి నడకన వచ్చి తహశీల్దార్ కార్యాలయంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు




ఉప్పలగుప్తంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంఎల్ఎ ఆనందరావు



కొత్తపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంఎల్ఎ సత్యానందరావు



మండపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంఎల్ఎ జోగేశ్వరరావు



ముమ్మిడివరం లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు




అమలాపురంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డిఆర్ఒ



కపిలేశ్వరపురంలో ఓటు వేయడానికి వీల్‌ఛైర్‌పై వస్తున్న ఓటరు

కార్టూ'నిజం'



గుండెపోటుతో అగ్నిమాపక అధికారి బాలకృష్ణ మృతి



బైరిశెట్టి బాలకృష్ణ(ఫైల్)

ప్రజాశక్తి - రాజోలు

స్థానిక పాత ఆంధ్రాబ్యాంక్ సమీపంలో గాంధీనగర్ లో నివాసముంటున్న అగ్నిమాపక అధికారి బైరిశెట్టి బాలకృష్ణ (62) గురువారం ఉదయం గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. రాజోలు అగ్గిమాపక కేంద్రంలో లీడింగ్ ఫైర్‌మెన్‌గా పనిచేసి ఆయన మూడు నెలల క్రితం ఉద్యోగోన్నతిపై ముమ్మిడివరం స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. రోజు మాదిరిగానే రాజోలు నుంచి మోటర్‌సైకిల్‌పై ముమ్మిడివరం డ్యూటీకి వెళ్తుండగా రాజోలు పంచాయతీ సమీపంలో గుండె పోటు రావడంతో అకస్మాత్తుగా మోటర్ సైకిల్ నుంచి కిందకు ఒరిగిపోయారు. వెంటనే స్థానికులు రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఆయనకు మొదటి భార్య చనిపోవడంతో రెండవ వివాహం చేసుకున్నారు. ఈనెల 28న శుక్రవారం ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు బాలకృష్ణ ఫైర్ మెన్ గా విధుల్లో చేరినపట్టి నుంచి వివిధ హోదా ల్లో సుమారు 22 సంవత్సరాలు రాజోలు అగ్నిమాపక కేంద్రం లోనే పనిచేశారు. మృతుని అన్న కుమారుడు బైరిశెట్టి రాధా కృష్ణ మూర్తి ఫిర్యాదు మేరకు రాజోలు ఎస్ఐ రాజకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టు మార్టం అనంతరం మృత దేహాన్ని బాలకృష్ణ స్వగ్రామం మామిడి కుదురు కంచి వారి పాలెం తరలించారు.

అగ్నిమాపక శాఖ రూ.25 వేల సాయం

అగ్నిమాపక అధికారి బైరిశెట్టి బాలకృష్ణ మృతి పై జిల్లా అగ్నిమాపక శాఖ అసోసియేషన్ సంతాపం వ్యక్తం చేసింది. మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా కుటుంబ సభ్యులకు రూ.25 వేల సాయం అందించింది.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



ముంబై , కేరళ జట్ల జరుగుతున్న వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న ఎఎస్ఆర్ (అరిగెల శ్రీ రంగయ్య) జాతీయస్థాయి డే అండ్ నైట్ వాలీబాల్ పోటీలు ఫ్లడ్‌లైట్‌ల మధ్య గురువారం రెండో రోజు కూడా హోరాహోరీగా జరిగాయి. తొలి మ్యాచ్ హెచ్ సి ఎస్ ముంబై-స్ట్రైకర్స్ కేరళ జట్ల మధ్య జరిగిన పోరు ఉత్కంఠ భరితంగా సాగింది. వాలీబాల్ పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున క్రీడాభిమానులు విచ్చేశారు. మార్చి ఒకటి వరకు మరో రెండు రోజులపాటు జరిగే వాలీ బాల్ పోటీల్లో చివరి రెండు రోజులు పురుషుల టీమ్‌లతో పాటు మహి ళా వాలీబాల్ టీమ్‌లు పాల్గొంటున్నట్టు టోర్నమెంట్ అధ్యక్షులు, మాజీ జడ్‌పిటిసి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీ నారాయణ తెలిపారు. చివరి రోజు బహుమతులు అందజేస్తారన్నారు.



ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో తలపడుతున్న జట్లు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - మామిడికుదురు

మండలంలోని నగ రం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మూడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అమలాపురం ఇఇ రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని పాశర్లపూడి మెయిన్ రోడ్డులో 11 కెవిలైన్ విద్యుత్ స్తంభాలుమార్చుండటం తో పాశర్లపూడి, పాశర్లపూడి బాడవ, బి.దొడ్డవరం, పెద పట్నం లంక ప్రాంతాలకు ఉదయం 10 నుంచి సాయం త్రం 6 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగు తుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని సహకరించాలన్నారు.

ఆశల తొలి బడ్జెట్ నేడే

- 'కూటమి' సర్కారు కనికరించేనా..
- నిధుల కోసం ఎదురు చూపులు



అసంపూర్తిగా నిలిచిపోయిన కోటిపల్లి-నరసాపురం రైల్వే లైను పనులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి గోదావరి జిల్లాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తోడ్పాటు కోసం జిల్లా వాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్‌ను నేడు విడుదల చేయనున్న విషయం తెలిసిందే. 2024 ఎన్నికలలో 'కూటమి' ప్రభుత్వానికి ఇక్కడి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పూర్తి స్థాయి మెజారిటీ ఇచ్చి కూటమి అభ్యర్థులను విజయశిఖరాలకు చేరువ చేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం జిల్లా వాసులపై ఏ మేరకు కనికరించిందో చూడాల్సి ఉంది.

చేయూత కోసం అన్నదాతల నిరీక్షణ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అన్నదాతలు ప్రభుత్వ చేయూత కోసం ఎదురు చూస్తున్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా అన్నదాతకు పెట్టుబడి సాయం ప్రకటించింది. ఈ సాయంపై నేడు ప్రకటించే బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్ల ఆధునీకరణకు చేపట్టేందుకు ప్రభుత్వం తోడ్పాటు కీలకమైంది. దాదాపు 10 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే కీలకమైన గేట్ల ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించడంతో జిల్లా రైతాంగం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది. జాతీయ నదీ పరిరక్షణ ప్రణాళిక (ఎన్ఆర్‌సిపి) కింద 'గోదావరి నదీ కాలుష్య నివారణ, పరిరక్షణ' అడుగులు పడాల్సి ఉంది మరో రెండేళ్లలో పుష్కరాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఘాట్ల ఆధునీకరణ, రాజమహేంద్రవరం నగర రహదారుల విస్తరణకు, డ్రైనేజీ పారుదల వ్యవస్థపైనా ప్రత్యేక చొరవ చూపాల్సి ఉంది. ముఖ్యమైన పర్యాటక, పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టి సారించాలి.

కోటిపల్లి రైల్వే లైనుకు ఎదురుచూపు

కీలకమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైను పూర్తి కావడం కోసం కోనసీమ ప్రజానీకం 22 ఏళ్లుగా ఎదురు చూస్తోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దఫదఫాలుగా రైల్వే బడ్జెట్‌లో మొత్తం రూ.1100 కోట్లు కేటాయించింది. మొత్తం నిర్మాణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వాటా ఇవ్వాల్సి ఉంది. గత ప్రభుత్వం తవ వాటా నిధులు కేటాయించని కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. సుమారు రూ.350 కోట్లు రాష్ట్ర వాటా ఇవ్వాల్సి ఉంది. భూ సేకరణ నిధుల కేటాయింపు, ప్రాజెక్టు కొనసాగింపుగా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉంది.

పారిశ్రామిక ప్రగతికి చేయూత లభించేనా

విశాఖ-కాకినాడ మధ్య పెట్రో రసాయనాల పెట్టుబడుల కేంద్రం వస్తుందని కాకినాడ జిల్లా వాసులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. కాకినాడ సెజ్‌లో నేటికీ పరిశ్రమల జాడ కనిపించడం లేదు. ఉప్పాడ హార్బర్ పనులకు గత ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించటంతో జిల్లా వాసులు తీవ్ర నిరాశ చెందారు. నూతన ప్రభుత్వం ఏ మేరకు చేయతనిస్తుందో వేచి చూడాలి. కోనసీమ జిల్లా అనేక సంవత్సరాలుగా పారిశ్రామిక రంగానికి దూరంగా ఉంది. ఈ జిల్లాలో 1.36 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. కొబ్బరి సాగులో రాష్ట్రంలోనే జిల్లాది మొదటి స్థానం. ఇక్కడి ఉత్పత్తుల విలువ సుమారు రూ.736 కోట్లుగా ఉండగా ప్రత్యక్షంగా లక్ష మంది, పరోక్షంగా మరో 3 లక్షల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. కొబ్బరి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపించాల్సి ఉంది. రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పడిన తూర్పు గోదావరి జిల్లాలో పారిశ్రామిక ప్రగతి అందని ద్రాక్షలా మారింది. గడిచిన ఏడాదిగా ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటుకు నోచుకోలేదు. పరిశ్రమల ఏర్పాటుకు, పరిశ్రమలల్లో పని చేసే కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

పట్టణ ప్రగతి పట్టాలెక్కేనా

గోదావరి పుష్కరాలకు సన్నద్ధమవుతున్న ఈ తరుణంలో ఘాట్ల ఆధునీకరణ, నదీ పరిసర పట్టణాలల్లో రహదారులు విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం చొరవ చూపాల్సి ఉంది. కోట్ల మంది ప్రజలు జిల్లాకు రానున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. మురుగునీటి శుద్ధి, డ్రెయినేజీ వ్యవస్థ ఆధునీకరణ, తాగునీటి వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలి. కాకినాడలో విడుదలయ్యే 50 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలను శుద్ధి చేసేందుకు గతంలో రూ.10 కోట్లు వెచ్చించారు. కానీ నిధులను కేటాయించక పనులు ప్రారంభం కాలేదు. నూతన ప్రభుత్వం ఏ మేరకు చొరవ చూపిస్తుందో వేచి చూడాల్సి ఉంది. నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా ఏర్పడిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అభివృద్ధి దిశగా అడుగులు పడాల్సి ఉంది. జిల్లాలో 22 మండలాల్లో 20 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. ఇక్కడ సరైన వైద్య సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రం అమలాపురంలో వైద్య సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాల్సి ఉంది. జిల్లా కేంద్రాలలో ప్రభుత్వ శాఖల సొంత భవనాల ఏర్పాటుకు అడుగులు పడాల్సి ఉంది.

మరమ్మతులకు పూర్వ విద్యార్థి విరాళం

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక నామన వెంకాయమ్మ జడ్పి హైస్కూల్లో బెంచీలు మరమ్మతుల కోసం ఆ పాఠశాల పూర్వ విద్యార్థి బొంతు శ్రీనివాస్ రూ.10 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్ఎం జొన్నాడ ఆశాలతకు ఆయన నగదును అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వి.శ్రీనివాస్, ఎన్.వినోద్, వి.కరిమల స్వామి, సతీష్‌రాజు, ఎం.సత్తిబాబు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారికి గౌడ సంఘం నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - మండపేట

పట్టణానికి చెందిన చిరు వ్యాపారి తీగిరెడ్డి శేఖర్ ను గౌడ సంఘం నాయకులు గురువారం పరామర్శించారు. ఇటీవల శేఖర్ పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుశీల, జై గౌడ సేన రాష్ట్ర కార్యదర్శి వంకా రామకష్ణ, జాతీయ బిసి సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తీగిరెడ్డి మహేష్ చిరు వ్యాపారికి కుటుంబాన్ని కలసి యోగ క్షేమలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేఖర్ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. శేఖర్ కన్ను, చేతికి గాయం అయ్యాయని పేర్కొన్నారు. పోలీసులు త్వరగా దర్యాప్తు చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

జడ్‌పిటిసి మాజీ సభ్యురాలు అన్నపూర్ణకు పితృవియోగం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం/అయినవిల్లి

అయినవిల్లి మాజీ జడ్‌పిటిసి సభ్యురాలు గంగుమళ్లకాశీ అన్నపూర్ణకు గురువారం పితృవియోగం కలిగింది. అన్నపూర్ణ తండ్రి సన్నవిల్లికి చెందిన గనిశెట్టి గోవిందరాజులు(83) గురువారం వయోభారంతో మృతి చెందారు. గోవిందరాజులు కు భార్య, కుమార్తె అన్నపూర్ణ ఉన్నారు. ఆయన అమలాపురం ఎస్‌కెబిఆర్ కళాశాల్లో బిఎ ఆనర్స్ చదివారు. గోవిందరాజులు హైదరాబాద్ అకౌంట్ జనరల్ ఆఫీసులో ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ చేశారు. గోవిందరాజులు మృతి పట్ల సర్పంచ్ చిక్కం పెదబాబు, ఎంపిటిసి సభ్యురాలు వంగా గిరిజకుమారి, గ్రామస్తులు ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - రామచంద్రపురం

దేశం గర్వించదగ్గ ఉద్యమకారుల్లో చంద్రశేఖర్ ఆజాద్ ఒకరని నియోజకవర్గ మైనార్టీ బిసి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ 94వ వర్ధంతి సందర్భంగా ద్రాక్షారామలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యాట్ల మాట్లాడుతూ నిరుపేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన చంద్రశేఖర్ ఆజాద్ బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదురించి మహాత్మా గాంధీ చేస్తున్న సహాయ నిరాకరణ ఉద్యమానికి మద్దతుగా నిలిచారన్నారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన చంద్రశేఖర్ ఆజాద్‌ని స్మరించుకోవడం నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం సభ్యుడు మేడిశెట్టి శ్రీనివాస్, మైనార్టీ బిసి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పూరిగుడిసె వద్ద పట్టా చూపుతున్న వృద్ధ దంపతులు

న్యాయం చేయాలని వృద్ధ దంపతుల వినతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన నాయుడు నూకమ్మ, భర్త వెంకటేశ్వరరావు ఇద్దరూ వద్దులు. వీరికి ఒక కుమార్తె. 2011 సంవత్సరంలో వాటర్ ట్యాంక్ సమీపంలోని రెవెన్యూ అధికారులు సెంటున్నర నూకమ్మ పేరు మీద స్థలం పట్టా ఇచ్చారు. అప్పటి నుంచి వీరికి ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో సతమతం అవడంతో ఇల్లు కట్టుకునే దారి లేక పరాయి పంచన పూరిగుడిసెలో చుట్టూ పరదాలు కట్టుకుని ఉంటున్నారు. మూడు సంవత్సరాల క్రితం ప్రభుత్వం వారు తనకిచ్చిన స్థలంలో రేకుల షెడ్డు వేసుకుని ఉండేందుకు స్థలం దగ్గరికి వెళ్లారు. వీరి స్థలాన్ని ఇరువైపులా ఉన్న వ్యక్తులు ఆక్రమించి నీకు స్థలం లేదు. అంటూ చెప్పడంతో వారు చేసేదేమీ లేక ఏప్రిల్ 17, 2023న అమలాపురం కలెక్టర్‌కు స్పందన ద్వారా ఫిర్యాదు చేశారు. వెంటనే కలెక్టర్ సర్వే చేసి నూకమ్మ స్థలాన్ని ఆమెకు ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై రాజవరం పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఎటువంటి సర్వేలు చేయకుండా సమస్య పరిష్కారం అయినట్లుగా నాయుడు నూకమ్మ, భర్త వెంకటేశ్వరరావును తహశీల్దార్ కార్యాలయానికి పిలిచి ఫొటో తీసుకుని వేలిముద్రలు వేయించుకుని మీ సమస్య తీరిపోయిందని చెప్పడంతో చేసేదేమీ లేక వెనుతిరిగారు. తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి ఈ విషయాన్ని తహశీల్దారు టి.రాజేశ్వరరావుకు విన్నవించుకుని న్యాయం చేయాలని కోరారు. వారి దరఖాస్తు తీసుకుని ఆయన మీరు వెళ్లిపోండి సమస్య పరిష్కరిస్తానంటూ చెప్పారు. నెల కావస్తున్నా ఈ విషయంపై తహశీల్దార్ పట్టించు కోకపోవడంతో కార్యాలయం చుట్టూ ఇన్ని రోజులు తిరిగినా వారి సమస్య పరిష్కారం కావడం లేదు. వెంకటేశ్వరరావు వయసు 75 సంవత్సరాలు కావడం, అతనికి వచ్చే పింఛన్ ద్వారా వచ్చే డబ్బుతోనే భార్యాభర్తలిద్దరూ జీవనం సాగిస్తున్నారు. స్థలం సర్వే చేసి అప్పగిస్తే రేకుల షెడ్డు వేసుకుంటామని వాని గోడు విన్నవించుకున్నారు.

సర్వే చేసి స్థలాన్ని అప్పగిస్తాం

సర్వే చేసి వారి స్థలాన్ని వారికి అప్పగిస్తాం ఇప్పటికే విఆర్‌ఒకు ఆదేశాలు జారీ చేశాం. వెంటనే సర్వే చేసి నూకమ్మ స్థలాన్ని అప్పగించి వారికి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

-టిఆర్.రాజేశ్వరరావు, తహశీల్దార్

'కూటమి సర్కారు పాలనలో అరాచకాలు'

ప్రజాశక్తి-బిక్కవోలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ సూర్యనారాయణ రెడ్డి

ఈ నెల 23న స్థానిక ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుమారుడు మనోజ్ రెడ్డి వివాహ రిసెప్షన్‌లో విధులు నిర్వహించిన స్థానిక సిఐ సుమంత్‌పై మనోజ్ రెడ్డి అనుచరులు దాడి చేసి గాయపరిచిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్టు అనపర్తి మాజీ ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి పార్టీల పాలనలో ఎన్నో అరాచకాలు అక్రమాలు జరుగుతున్నాయని, ప్రజలకు రక్షకభటులుగా ఉండే పోలీసులపైనే అధికార పార్టీ నాయకుల అనుచరులు దాడులకు దిగి దాడి చేసి గాయపరిస్తే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సిఐపైనే దాడికి దిగారంటే అధికార పార్టీ ఆగడాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రజలు గ్రహించాలని కోరారు. పట్టపగలే వైసిపి కార్యకర్తలు నాయకులపై దాడులు జరుగుతుంటే పట్టించుకోని పోలీసులు కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తుంటే అటువంటి పోలీసులపైనే అధికార పార్టీ నాయకులను దాడులు చేస్తున్నారని తెలిపారు. సిఐపై దాడి సంఘటనను స్థానిక ఎంఎల్ఎ ఇప్పటివరకు ఖండించకపోవడం ఈ పాలకులు పోలీస్ వ్యవస్థకి ఏపాటి గౌరవం ఇస్తున్నారో పోలీసులు అర్థం చేసుకోవాన్నారు. కూటమి పాలనలో అనపర్తి నియోజకవర్గంలో గంజాయి, పేకాట, మద్యం మత్తులో అనేక అసాంఘిక కార్యక్రమాలు పెరిగాయని, దీంతో యువత పెడదోవ పడుతోందన్నారు. సాక్షాత్తు ఎంఎల్ఎ స్వగ్రామం రాయవరంలోనే పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని, ఆ పేకాట శిబిరానికి రూ.లక్ష ఎంఎల్ఎకు ముడుపులుగా అందుతున్నాయని ఆరోపించారు. డబ్బు సంపాదించాలంటే ఏదైనా వ్యాపారం చేసుకోవాలి తప్ప రాజకీయాన్ని వ్యాపారం చేయకూడదని ఆయన హితవు పలికారు. పోలీసులపై దాడులు చేయడం దురుసుగా ప్రవర్తించడం ఇది కొత్త కాదని, 2014-2019 మధ్యలో కూడా అప్పటి టిడిపి ఎంఎల్ఎ, ఇప్పటి బిజెపి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు మనోజ్ రెడ్డి అనుచరులు అప్పటిలో అనపర్తిలో ట్రైనీ ఎస్ఐపై దాడి చేసి గాయపరిచారని తెలిపారు. అప్పట్లో ఈ ఘటనపై పోలీసు ఉన్నత స్థాయి అధికారులు, అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలఒగ్గి ఏ విధమైన చర్యలూ తీసుకోలేదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, వైసిపి బిక్కవోలు మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి, పడాల దుర్గా ప్రసాద్ రెడ్డి, ఎంపిటిసి కొండేటి భీమేష్, సత్తి హరి ప్రసాద్ రెడ్డి, కర్రి గీతా సతీష్ కుమార్ పాల్గొన్నారు.



కూచిపూడి నాట్య బృందంతో ఆలయ కమిటీ సభ్యులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-కడియం

మండలంలోని కడియపులంక శ్రీ అపర్ణ సమేత అనంతరేశ్వర పంచాయతన క్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మార్గాని సత్యనారాయణ ఆధ్వర్యంలో యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయంలో భారతీయ సనాతన సంస్కృతి పునరుద్ధరణలో భాగంగా ఏర్పాటు చేసిన మండపేట శ్రీకళా కూచిపూడి నాట్యాలయానికి చెందిన ఎస్.భవాని సత్యనారాయణ శిష్య బృందం నృత్య ప్రదర్శన యాత్రికులను, గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం కళాకారులకు ఆలయ కమిటీ చైర్మన్ మార్గాని సత్యనారాయణ, మాజీ ఎంపిపి మార్గాని లక్ష్మి మెమెంటోలు అందజేసారు. నాట్యాచారిణి భవాని సత్యనారాయణకు స్వామివారి చిత్రపటం, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నర్సరీ సంఘం మాజీ అధ్యక్షుడు మల్లు పోలరాజు, ధర్మాసనం వెంకటరమణ, పెనుమాక శ్రీనివాస్, ఆరేటి భద్రరావు పలువురు నర్సరీ రైతులు పాల్గొన్నారు.

పౌర సేవల్లో స్వచ్ఛంద సంస్థల కృషి అమూల్యం

అంతర్జాతీయ ఎన్‌జిఒ దినోత్సవంలో రాంబాబు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



కేక్‌ను కట్ చేస్తున్న స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు

సమాజంలో పౌరుల తక్షణ అవసరాలు తీర్చడంలో స్వచ్ఛంద సేవా సంస్థల కృషి అమూల్యమైనదని స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు లైన్ డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. గురువారం స్థానిక స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ ఎన్‌జిఒ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల మధ్య పరిచయం, సమన్వయం సాధించడం కోసం పూర్వపు ఉభయ జిల్లాల స్వచ్ఛంద సేవా సంస్థలతో ఒక డైరీని రూపొందించనున్నట్లు రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 40 మంది స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులను రాంబాబు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో అనూప్, జోషిబాబు, ప్రభుదాస్, పోసికుమార్, మద్దాల అను, రాజయోన, శకుంతల, లక్ష్మణరావు, రుద్రమదేవి, సురేష్, కుసుమ, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. రాజమండ్రి నగరంలో స్వచ్ఛంద సేవలకు చిరునామాగా ఉంటున్న స్వర్ణాంధ్ర రాంబాబుని స్వచ్ఛంద సేవకులు సత్కరించారు. భవిష్యత్తులో ప్రజల అవసరాలు తీర్చడానికి అందరూ కలిసి పనిచేయాలని ఒకరికొకరు పరస్పరం సహకరించుకోవాలని సమావేశం తీర్మానించారు.

స్ట్రాంగ్ రూముల్లో బ్యాలెట్ బాక్సులు

ప్రజాశక్తి - కాకినాడ



స్ట్రాంగ్ రూముల్లో భద్రపర్చిన బ్యాలెట్ బాక్సులు

ఉభయ గోదావరి జిల్లాల పట్టబద్రుల నియోజకవర్గం ఎంఎల్‌సి ఎన్నికల్లో భాగంగా గురువారం జిల్లాలో 98 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ పూర్తయింది. అనంతరం బ్యాలెట్ బాక్సులను కలెక్టరేట్‌లో వివేకానంద హాలులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచినట్లు ఎఆర్‌ఒ, డిఆర్‌ఒ జె.వెంకటరావు తెలిపారు. గురువారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో వివేకానంద హాలు వద్ద ఏర్పాటుచేసిన రిసెప్షన్ కౌంటర్, స్పెషల్ కౌంటర్ల వద్ద ఆయా పోలింగ్ కేంద్రాల నుంచి పోలింగ్ సిబ్బంది తీసుకువస్తున్న పోలింగ్ సామాగ్రి, బ్యాలెట్ బాక్స్‌లను, ఇతర ఏర్పాట్లును ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, ఎన్నికల డిటి ఎం.జగన్నాథంతో కలిసి డిఆర్‌ఒ పర్యవేక్షించారు.



కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని తాడిపత్రిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిహెచ్‌సి ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. నోటి, రొమ్ము గర్భాశయ, థైరాయిడ్ ముఖద్వారా కేన్సర్ లక్షణాలపై అవగాహన కల్పించారు. సర్వేలో సంబంధిత లక్షణాలు కన్పిస్తే వారికి రక్త పరీక్షలు నిర్వహించి ఆరోగ్య కేంద్రం ద్వారా చికిత్స చేయడం జరుగుతుందని పిహెచ్‌సి వైద్యులు సునీత మెర్సి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు గుంటక శ్రీనివాస్, అహ్మద్ భాష, సత్తిబాబు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బాబు

మైలేజీ కోసమే ఎంఎల్‌సి దువ్వాడ వ్యాఖ్యలు

ప్రజాశక్తి - పెద్దాపురం

వైసిపిలో మనుగడ లేకపోవడంతో రాజకీయ మైలేజీ కోసమే ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌పై వ్యాఖ్యలు చేస్తున్నారని కుడా ఛైర్మన్ తుమ్మల బాబు అన్నారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దువ్వాడ శ్రీనివాస్ వ్యాఖ్యలను చూస్తే అతని మానసిక స్థితి సరిగ్గా లేనట్టు అనిపిస్తుందన్నారు. మరోసారి పవన్ కళ్యాణ్‌పై వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జనసేన పట్టణ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, కటారి శ్రీను, సాయిబాబు, పట్టణ అధ్యక్షులు సరోజ్ వాసు, నాయకులు లక్ష్మణ్ దివాకర్, పిట్టా జానకిరామయ్య పాల్గొన్నారు.

శ్మశానం చుట్టూ చెత్త గుట్టలు

ప్రజాశక్తి - పెద్దాపురం



శ్మశాన వాటిక వద్ద పేరుకుపోయిన చెత్త

పెద్దాపురం - రాయ భూపాలపట్నం రహదారిలోని సీతారాముడు శ్మశానం ప్రహరీ గోడ చుట్టూ చెత్త గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే దోమలు, ఈగలు పెరిగిపోయి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముందని ప్రజలు వాపోతున్నారు. వర్షాలు పడితే ఈ చెత్త గుట్టలపై కురిసిన వర్షం నీరు కాలువలుగా ప్రవహించి స్మశానం సమీపంలో ఉన్న అన్ని ప్రాంతాలను కలుషితం చేస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి ఈ చెత్త పోగులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు

నేడు నదీ జలాల సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జాతీయ జలవనరుల శాఖ, జలశక్తి విభాగం సంరక్షణ సంస్థ ఆదేశాలతో శుక్రవారం నగరంలో నదీజలాల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ కేతన్ గార్గ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకూ పుష్కరఘాట్ వద్ద యోగా కార్యక్రమం, ఉదయం.8 గంటల నుంచి 8:30 వరకూ నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలోని కాస్మొపాలిటన్ క్లబ్ గోడపై మ్యూరల్ పెయింటింగ్ కార్యక్రమం ఉంటుందన్నారు. 8:30 నుంచి 10 గంటల వరకూ పుష్కరఘాట్‌లో బోట్ రేస్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి 5:30 వరకూ నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి పుష్కరఘాట్ ర్యాలీ ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి 6:30 వరకు పుష్కర్ ఘాట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిభావంతులయిన స్థానిక గాయకులతో గాన కచేరి ఉంటుందన్నారు. సాయంత్రం 6:30 నుంచి రాత్రి 7:00 వరకు పుష్కరఘాట్‌లో నది ఒడ్డున హారతి, రాత్రి 7 గంటల నుంచి 7:30 వరకు పుష్కరఘాట్ నందు మెమెంటోస్, బహుమతులు, ధ్రువపత్రాలు పంపిణీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బాలయోగీశ్వరుల తీర్థం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

భగవాన్ బాలయోగీశ్వరుల తీర్థ మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఆశ్రమంలోని భగవాన్ పెద్ద, చిన బాలయోగీశ్వరుల పాలరాతి విగ్రహాలను, సమాధులను సందర్శకులు దర్శించుకున్నారు. నగర పంచాయతీ మున్సిపల్ అధికారులు ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముమ్మిడివరం సిఐ ఎం .మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.జ్వాలాసాగర్ బందోబస్తు నిర్వహించారు.